సాక్షి ఒడిశా

బుధవారం । 30 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,08,771లు, బంగారం 652 మిల్లీగ్రాములు, వెండి 44గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రహస్య కెమెరాతో చిక్కిన యువకుడు

శ్రీమందిరం లోపలి దృశ్యాలను గుట్టురట్టు కాకుండా బంధిస్తున్న ప్రయత్నంలో యాత్రికుడు రహస్య కెమెరాతో పట్టుబడ్డాడు.

- 8లో

వీఐపీ దర్శనం ముసుగులో మోసం

శ్రీమందిరంలో మూల విరాటుల వీఐపీ దర్శనం పేరుతో భక్తులను మోసం చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది.



- 8లో

న్యూస్‌రీల్

భారీగా గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: స్థానిక రైల్వేస్టేషన్ మూడో నంబర్ ప్లాట్ ఫారంలో గంజాయితో ఒక యువకుడు పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వ్యక్తి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ రోహన్‌గా గుర్తించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సోమవారం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ప్లాట్ ఫారం నంబర్ మూడులో అనుమానాస్పదంగా కనిపించిన ఒక యువకుడి బ్యాగు తనిఖీ చేయగా అందులో గంజాయి పట్టుబడింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని కోర్టుకు తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళాలు



తాళాలు వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

జయపురం: సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి ఝుడిగుడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి స్థానికులు తాళాలు వేశారు. కేంద్రానికి అంగన్‌వాడీ కార్యకర్త సక్రమంగా రాకపోవడంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించడం లేదని ఆగ్రహించారు. సదరు కార్యకర్త వారానికి రెండు రోజులు మాత్రమే వస్తున్నారని ఆరోపించారు. పౌష్టికాహారం పిల్లలకు, మహిళలకు సరఫరా చేయకుండా స్టోర్ రూంలో ఉంచుతున్నారని, దీంతో అవి పురుగులు పడుతున్నాయని వాపోయారు. ఈ విషయాన్ని ఇదివరకే ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు తెలియజేశామన్నారు. సీడీపీవో, సూపర్ వైజర్లు గ్రామానికి వచ్చి సమస్యను పరిష్కరించేవరకు తాళాలు తెరవనివ్వమని స్పష్టం చేశారు. దీనిపై సీడీపీవో సబిత బ్రహ్మ స్పందించి గ్రామస్తుల ఆరోపణలపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

విదేశీ మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లతో నిందితుడు

రాయగడ: అక్రమంగా కారులో విదేశీ మద్యాన్ని తరలిస్తున్న ఒక యువకుడిని మునిగుడ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 123.480 లీటర్ల విదేశీ మద్యం బాటిళ్లు, రవాణాకు వినియోగించే కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు. మునిగుడలో విదేశీ మద్యం జోరుగా అక్రమ రవాణా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు.

మూల విరాటులకు మహాస్నానం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాటులకు మంగళవారం మహాస్నానం చేయించడం అనివార్యం అయింది. ఆలయం లోపల ఒక సేవకుడు పడిపోయి రక్తస్రావం కావడంతో ఆలయం పవిత్రతకు భంగం వాటిల్లినట్లు పరిగణించి ఈ చర్య చేపట్టారు. దీంతో సాధారణ భక్తుల సర్వదర్శనం ప్రభావితం అయింది. తాత్కాలికంగా కొన్ని గంటల పాటు దర్శనం నిలిపివేశారు. స్వామివారి ప్రాతఃకాల ధూప సేవ కోసం సువారొ బొడు సేవకుడు శ్రీమందిర గర్భగుడిలో పూలు మరియు పాత్రలను అమర్చుతుండగా జారిపడిపోయాడు. ముఖానికి గాయమై రక్తం నేలపై చిమ్మింది. పాహడొ ఉఠా మహాస్నానంగా పేర్కొనే ఆలయ సంప్రదాయానికి అనుగుణంగా ప్రధాన దేవతలు మరియు ఆలయం స్వచ్ఛత పునరుద్ధరణకు మహాస్నానం నిర్వహించారు. ఆలయ ఆచారాల ప్రకారం ఆలయ ప్రాంగణంలో రక్తస్రావం, వాంతులు ఇతరేతర అపరిశుభ్రతకు సంబంధించిన ఏదైనా సంఘటన చోటుచేసుకుంటే ఆలయం, దేవతల పవిత్రతను పునరుద్ధరించేందుకు మహాస్నానం నిర్వహిస్తారు.

హే జగన్నాథా..!

- శ్రీమందిరానికి భద్రత లోపం
- సోషల్ మీడియాలో రత్న భాండాగారం ఫొటోలు వైరల్
- ఫొటోలు పోస్టు చేసిన భారత పురావస్తు శాఖ
- విస్మయం వ్యక్తం చేస్తున్న భక్తజనం



భువనేశ్వర్:

ప్రసిద్ధ పూరీ జగన్నాథ స్వామివారి శ్రీమందిరం అభద్రతా వ్యవస్థ నడుమ కొట్టుమిట్టాడుతోంది. గత కొద్దికాలంగా ఈ దేవస్థానంపై ఉగ్రవాదులు కన్నువేసి ఉన్నట్లు సమాచారం. అయితే ఇటీవల కాలంలో శ్రీమందిరం కనీస భద్రతని కూడా నోచుకోలేని దయనీయ పరిస్థితులు తాండవిస్తున్నాయి. భద్రత సంబంధిత లోపాలు తలెత్తిన ప్రతిసారీ శ్రీమందిరం పాలకవర్గం, రాష్ట్ర న్యాయశాఖ ఇతర అనుబంధ బాధ్యతాయుతమైన అధికార వర్గాలు బాధ్యులైన వారికి వ్యతిరేకంగా చర్యలు చేపడతామని మీడియాలో అట్టహాసంగా ప్రకటించి, విస్తృత ప్రచారం తర్వాత అంతా సద్దుమణగడం ఆనవాయితీగా మారింది. దీంతో ఆలయం లోపలి ప్రాంగణానికి పరిమితం కావాల్సిన ఆచార వ్యవహారాలు, ఆలయ కట్టడాలు వగైరా బాహ్య ప్రపంచంలో సోషల్ మీడియా వేదికగా బట్టబయలవుతున్నాయి. ఈ చర్యలపై బాధ్యతాయుతమైన అధికార వర్గాల చర్యల నిర్వీర్యత ప్రభావంతో ఈసారి మరో పెద్ద ఘోరం తెరకెక్కింది.

సోషల్ మీడియాలో వైరల్

పూరీ జగన్నాథుడు సిరిమంతుడు. స్వామివారి ఆస్తులు, నగలు, ఆభరణాలు వగైరాకు సంబంధించి వాస్తవ లెక్కలు, జమలు దాదాపు ఎవరికీ తెలియవు. అలాగే అత్యంత అమూల్యమైన స్వామి ఆభరణాలు ఇతర సొత్తు గోప్యంగా రత్న భాండాగారంలో పదిలపరచి ఉంటుంది. ఇది నిత్యం అగణిత భక్తులు, యాత్రికులు సందర్శించే శ్రీమందిరం ప్రాంగణంలోనే నెలకొని ఉంది. అయితే ఎక్కడ ఉంది అనే విషయం ఇంతవరకు సాధారణ భక్తజనులకు తెలియదు. అంతటి గోప్యమైన రహస్య రత్న భాండాగారం ఫొటోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఈ ప్రసారానికి సాక్షాత్తు భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ సారథ్యం వహించింది. పురాతన కట్టడాలు, ప్రాముఖ్యత, అనుబంధ విలువల పరిరక్షణలో కీలక పాత్రధారిగా వెలుగొందుతున్న ఏఎస్ఐ ఇటువంటి బహిర్గతానికి పాల్పడడం భక్తజన హృదయాల్ని కలచి వేస్తోంది. రాష్ట్రంలో సాధారణ ప్రజలకు కనీస భద్రత, రక్షణ కొరవడిందని గగ్గోలు ఎత్తుతున్న తరుణంలో, సాక్షాత్తు జగతినాథునికి రక్షణ, భద్రత కల్పించడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం నిలువునా విఫలమైందనే ఆరోపణలతో దద్దరిల్లుతోంది. జగన్నాథ స్వామివారి రత్న భాండాగారం లోతైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. రత్న భాండాగారం పవిత్రతను భక్తులు ఎంతో గౌరవిస్తారు. భారత పురావస్తు శాఖ శ్రీమందిరం ప్రాంగణం లోపలి ప్రాకారంలో రత్న భాండాగారం చిత్రాలను బాహ్య ప్రపంచానికి బహిరంగపరచడం ఉద్దేశపూర్వక చర్యగా కాకపోయినా, మతపరమైన మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది. సామాజిక మాధ్యమాల్లో ఈ దృశ్యాల ప్రసారంపై రేగిన మనోభావాలకు ప్రతిస్పందనగా భారత పురావస్తు శాఖ చిత్రాలను తొలగించి పారదర్శకత చాటుకునే దిశలో పావులు కదుపుతోంది.

తీవ్ర విచారం

మహాప్రభు జగన్నాథునిపై భారత పురావస్తు సర్వే సంస్థ, భారత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి రత్న భాండాగారం చిత్రాలను తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేయడం ఘోర అపచారమని విపక్ష బిజూ జనతా దళ్ నాయకుడు డాక్టర్ అమర్ పట్నాయక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు సువిశాల శ్రీమందిరం ప్రాంగణంలో రత్న భాండాగారం ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదు. మహాప్రభు ఆభరణాలు మరియు అమూల్యమైన సంపద భద్రతకు భంగం కలిగించేలా భారత పురావస్తు శాఖ భాండాగారం ఉనికిని సమగ్ర ప్రపంచానికి ప్రచారం చేసినట్లు అయిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ అనుబంధ సంస్థలు, శ్రీజగన్నాథ ఆలయ అథారిటీ (ఎస్‌జేటీఏ), పూరీ అధికార వర్గాలు ఇతరేతర సమస్త విభాగాలు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామిపై అంకిత భావంతో సేవలు అందిస్తారని సమగ్ర భక్త జన వర్గం పూర్తిగా విశ్వసిస్తుంది. ఏఎస్ఐ దుశ్చర్యతో ఈ విశ్వాసం బీటలు వారింది. ఈ విశ్వాసాన్ని కూడగట్టుకునే ప్రయత్నంలో సాంఘిక మాధ్యమం వేదిక నుంచి రహస్యమయమైన ఫొటోలు తొలగించింది. అయితే ఇంతలోనే జరగరాని నష్టం జరిగి పోయిందని డాక్టర్ అమర్ పట్నాయక్ తన సోషల్ మీడియా ఖాతాలో వివరించారు. ఒడియా ఆత్మ గౌరవం (అస్మిత)ను రక్షించడం కోసమని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ నేతృత్వంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ, ఈ విచారకర సంఘటనపై సమగ్ర దర్యాప్తు కోసం వెంటనే నిందితులకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్, కేసులు నమోదు నమోదు చేస్తుందా అని నిలదీశారు. ఈ సంఘటనపై ప్రత్యక్షంగా చొరవ కల్పించుకునేందుకు పూరీ గజపతి మహారాజా దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను గౌరవించడం అనివార్యమని హితవు పలికారు.

మజ్జిగౌరికి శ్రావణ మాసం సారె



అమ్మవారి మందిరం వద్ద సారెను పూజిస్తున్న అర్చకుడు



రాయగడ: ఉత్కళాంధ్రుల ఇలవేల్పు, కోర్కెలు తీర్చే చల్లని తల్లి మజ్జిగౌరి అమ్మవారికి స్థానిక కస్తూరీనగర్‌కు చెందిన మహిళలు అత్యంత ప్రీతికరమైన మంగళవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. కస్తూరీనగర్‌లోని సత్యనారాయణ స్వామి మందిరం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి అమ్మవారికి శ్రావణమాసం సారెను మంగళ వాయిద్యాల నడుమ అందజేశారు. పిండి వంటలు, గాజులు, పసుపు, కుంకుమ, చీర వంటి వస్తువులను అమ్మవారికి సమర్పించారు. మజ్జిగౌరి అమ్మవారి ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ బెరుకొ ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇకపై ప్రతీ ఏడాది శ్రావణ మాసంలో అమ్మవారికి సారెను సమర్పించడం సాంప్రదాయంగా కొనసాగిస్తామని కస్తూరీనగర్ ప్రాంత మహిళలు తెలియజేశారు. ఇదివరకు బుదరావలస, కళాశాల రోడ్డు తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారికి ఆషాఢ మాసం సారెను సమర్పించుకున్న సంగతి తెలిసిందే.



సారె తీసుకొస్తున్న మహిళలు



మహిళల ర్యాలీ

విద్యుత్ షాక్‌తో ఇద్దరు యువకులకు గాయాలు



స్వల్పగాయాలతో బయటపడ్డ త్రినాథ్ ఖీలో



స్వల్పగాయాలతో బయటపడ్డ త్రినాథ్ ఖీలో

మల్కన్‌గిరి:

జిల్లాలోని చిత్రకొండ సమితి కేంద్రంలో మంగళవారం ఇద్దరు యువకులు విద్యుత్ షాక్‌తో గాయాలుపాలయ్యారు. త్రినాథ్ ఖీలో, ఉద్దవ్ దాస్ నాగ్ అనే ఇద్దరు యువకులు ఒక భవనంపై నుంచి సెల్ఫీ తీసుకున్నారు. అయితే అదే సమయంలో భవనంపై నుంచి వెళ్తున్న 33 కేవీ విద్యుత్ తగలడంతో పైనుంచి కింద పడిపోయారు. దీంతో ఇద్దరికీ తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వీరిలో ఉద్ధవ్ దాస్‌కి పరిస్థితి విషమంగా ఉండడంతో మల్కన్‌గిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ వైద్యులు చికిత్సను అందజేస్తున్నారు .

అదుపుతప్పిన పికప్ వ్యాన్



గోడను ఢీకొని ఆగిపోయిన వ్యాన్

రాయగడ: జేకేపూర్ నుంచి రాయగడ వైపు వస్తున్న ఒక పికప్ వ్యాన్ అదుపుతప్పి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీని ఢీకొంది. దీంతో అంగన్‌వాడీలో ఉన్నటువంటి చిన్నారులు భయపడ్డారు. అయితే ఘటన స్థలంలోనే వ్యాన్‌ను వదిలి డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న చందిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం జేకేపూర్ నుంచి రాయగడ వైపు వెళ్తున్న పికప్ వ్యాన్ నాయుడుపేట వద్ద ఎదురుగా వస్తున్న ఒక మోటార్ సైకిల్‌ను ఢీకొనబోయి అదుపుతప్పింది.

బోల్ భం భక్తుల వ్యాన్ బోల్తా



గారబంద పీహెచ్‌సీలో చికిత్స పొందిన క్షతగాత్రులు

- ఆరుగురు భక్తులకు గాయాలు



బరంపురం ఆస్పత్రికి తరలిస్తున్న మెడికల్ సిబ్బంది

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ సమితి మహేంద్రగిరికి వ్యాన్‌లో సోమవారం సాయంత్రం గంజాం జిల్లా ఛత్రపురం నుంచి 20 మంది బోల్ భం భక్తులు వెళ్లారు. అక్కడ గోకర్ణేశ్వర మందిరంలో మహాదేవుడిని దర్శించుకుని తిరిగి వస్తున్న సమయంలో బుర్‌ఖాత్ పాస్‌కు సమీపంలోని ఘాటి మలుపు వద్ద వ్యాను అదుపుతప్పి బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు బోల్ భం భక్తులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న గారబంద పోలీసులు సంఘటన స్థలానికి విచ్చేసి వారిని తొలుత గారబంద ప్రభుత్వ ప్రాథమిక కేంద్రంలో చేర్చారు. అనంతరం పర్లాకిమిడి ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వారిలో శుభం ఆచార్య, డి.నారాయణరావులు తీవ్రంగా గాయపడడంతో మెరుగైన చికిత్స కోసం బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి హుటాహుటిన తరలించినట్లు గారబంద పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రశాంత నిసిక వెల్లడించారు. ఘటనతో మహేంద్రగిరి వెళ్లేదారిలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

విద్యార్థిని మృతిపై దర్యాప్తునకు ఆదేశం



మృతి చెందిన విద్యార్థిని దివ్య మండంగి



కలెక్టర్ అశుతోష్ కులకర్ణి

రాయగడ:

సదరు సమితి కూలిలోని ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థిని దివ్య మండంగి మలేరియా వ్యాధితో మృతి చెందిన ఘటనపై జిల్లా యంత్రాంగం స్పందించింది. కలెక్టర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన అశుతోష్ కులకర్ణి ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, మూడు రోజుల్లో తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ మేరకు ఒక దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి ఈ కమిటీలో ఉన్నారు. ఈ దర్యాప్తు కమిటీ ఆశ్రమ పాఠశాలకు వెళ్లి అక్కడ వాస్తవాలను పరిశీలిస్తారు. అదేవిధంగా మృతి చెందిన విద్యార్థిని కుటుంబ సభ్యులను కలిసి వారి అభిప్రాయాలను సైతం సేకరిస్తారు. కొద్దిరోజుల క్రితం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న నాలుగో తరగతి విద్యార్థిని దివ్య మండంగి తీవ్ర అనారోగ్యానికి గురైనప్పటికీ, తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. పరిస్థితి విషమించడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి నిర్వాహకులు చికిత్స కోసం తీసుకొచ్చారు. అయితే విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బరంపురం తరలించాలని జిల్లా కేంద్రాస్పత్రి వైద్యులు చెప్పడంతో అప్పుడు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తల్లిదండ్రులు బరంపురం తరలించగా చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందింది. ఆశ్రమ పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థిని మృతి చెందిందని కుటుంబీకులు, గ్రామస్తులు ఆశ్రమ పాఠశాల వద్ద మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే.

ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి

- డైట్ విద్యార్థుల నిరసన



ఆందోళన చేపడుతున్న డైట్ విద్యార్థులు

జయపురం: స్థానిక జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం(డైట్)లో ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న ఒక విద్యార్థినిని ఒక అధ్యాపకురాలు మానసికంగా వేధిస్తోందని డైట్ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. డైట్ ప్రధాన గేట్ ముందు సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి నిరసన తెలుపుతూ అధ్యాపకురాలిని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో డైట్ ప్రిన్సిపాల్ రూపచంద్ర సారెన్ విద్యార్థుల వద్దకు వచ్చి చర్చించారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. అధ్యాపకురాలు స్వాతి 7 నెలలుగా అనేక ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. డైట్ అధికారులు ఒక వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేయగా, ఆమె అన్ అఫీషియల్‌గా మరో గ్రూప్ రూపొందించారని వెల్లడించారు. ఆ గ్రూపులో అర్ధరాత్రి వివిధ రకాల మెసేజ్‌లు చేస్తున్నారని, వ్యక్తిగతంగా ఆక్షేపిస్తున్నారని ఆరోపించారు. డబ్బులు లేకపోతే ఎందుకు చదువుతున్నారని ఒక విద్యార్థినిని అందరి ఎదుట అవమానించారని పేర్కొన్నారు. దీంతో సదరు విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించిందని వాపోయారు. ఈ విషయంపై శనివారం ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశామని వెల్లడించారు. అయితే సోమవారం చర్చిద్దామని ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారని, చర్చలకు అందరూ వచ్చినా అధ్యాపకురాలు స్వాతి రాకపోవడంతో సాయంత్రం 6 గంటల వరకు చూసి ఆందోళనకు దిగామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్‌కు మరమ్మతులు.. నిలిచిన వాహనాలు


రైల్వే ట్రాక్ మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: కేదారిపురం–పురుషోత్త పురం మధ్య ఎల్‌సీ గేట్‌ను రైల్వే అధికారులు మంగళవారం సాయంత్రం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు మూసివేశారు. ట్రాక్ మరమ్మతుల సమాచారాన్ని వాహనదారులకు ముందుగానే అధికారులు తెలియజేశారు. దీంతో కేదారిపురం, ముచ్చింద్ర, బెన్నుగానిపేటకు చెందిన విద్యార్థులను రెండో పూటే ఇళ్లకు పంపించేశారు. మిగిలిన వాహనాలు బెన్నుగానిపేట మీదుగా ఇచ్ఛాపురం చేరుకున్నాయి

పూడిలంక వంతెన పనులు పూర్తిచేస్తాం

వజ్రపుకొత్తూరు: పూడిలంక వంతెన పనులు స్వయంగా పర్యవేక్షించి పూర్తి చేస్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రూ.4 కోట్లతో నిర్మించనున్న పూడిలంక వంతెన నిర్మాణ పనులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి మంత్రి మంగళవారం శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంచినీళ్లపేట జెట్టీ నిర్వహణకు కేంద్ర మంత్రితో మాట్లాడి నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ పూడిలంక వంతెన పనులు పూర్తి చేసి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిమ్మల కృష్ణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కణితి సురేష్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పి.ఈశ్వరరావు, సైని భాస్కరరావు, టి.గణపతి, రంగారావు, హేమారావు తదితరులు పాల్గొన్నారు.

‘గోవిందరాజులు వ్యాఖ్యలు అర్థరహితం’

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కళింగ వైశ్య రాష్ట్ర అధ్యక్షునిగా ఉంటూ వైఎస్సార్‌సీపీపై బోయిన గోవింద రాజులు చేసిన వ్యాఖ్యలు అర్థ రహితమని, ఇదే సంఘంలో వైఎస్సార్‌సీపీ ప్రతినిధులుగా ఉన్న తమ మనోభావాలు తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయని రాష్ట్ర వైఎస్సార్ సీపీ కళింగ వైశ్య బీసీ అనుబంధ సాధికార కమిటీ అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ కోశాధికారి తంగుడు నాగేశ్వరరావు, పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కోరాడ చంద్రభూషణగుప్త, వైఎస్సార్‌సీపీ నాయకులు తంగుడు జోగారావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరికి పదవులు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేయడంలో ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ ఏ రాజకీయ పార్టీ ఇలాంటి అవకాశాలు కల్పించలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 1999లో ఎన్డీఏ ప్రభుత్వంతో సీట్లు సర్దుబాటు చేసుకొని మిత్ర పక్షంగా ఉంటూ విజయం సాధించిన తర్వాత టీడీపీ కేంద్ర క్యాబినెట్‌లో చేరకపోవడానికి కారణాలను మీ పార్టీ పెద్దలను అడిగి తెలుసుకొని సమాజానికి తెలియజేయాలని కోరారు. బీసీలను బ్యాక్‌బోన్‌గా గుర్తించిన ఏకైక పార్టీ వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి కళింగవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, 10 కుల కార్పొరేషన్ డైరక్టర్లను, నాలుగు బిజినెస్ కార్పొరేషన్ డైరక్టర్లను, బీసీ కళింగ వైశ్య మహిళకు శ్రీకాకుళం సుడా చైర్మన్ ఇచ్చి కళింగ వైశ్యులను గుర్తించారన్నారు. కూటమి పాలన 14 నెలల్లో పలాసలోని ఒక్క ఏఎంసీ పదవి తప్ప గతంలో ఉన్న మల్లా శ్రీనివాసరావుని కూడా తిరిగి నియమించలేదన్నారు.

టి.డి.వలసలో జ్వరాలపై సర్వే


ఇంటింటా వివరాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

జి.సిగడాం: టంకాల దుగ్గివలస గ్రామంలో జ్వరాలపై వైద్యసిబ్బంది మంగళవారం ఇంటింటా సర్వే చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు జ్వరపీడితుల వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తామని ఎంపీడీఓ జి.రామకృష్ణారావు, వైద్యాధికారి బి.యశ్వంత్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే గ్రామంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశామని, పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నామని చెప్పారు.

3న జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి జూనియర్స్ చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆగస్టు 3న నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్ మంగళవారం తెలిపారు. శ్రీకాకుళం కొత్త రోడ్డు సమీపంలో ఉన్న సీఎస్ఎన్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జరిగే ఈ ఎంపికలకు 19 ఏళ్లలోపు బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. విజేతలను త్వరలో కర్నూలు వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ చెస్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు పంపిస్తామని ఆల్ ఇండియా చెస్ ఇన్ స్కూల్ కమిటీ సభ్యులు సనపల భీమారావు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాలబాలికలు జనన ధృవీకరణ పత్రం, రూ.300 ఎంట్రీ ఫీజుతో హాజరుకావాలని, పూర్తి వివరాలకు 9912559735 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అధ్యాపకులకు శిక్షణ శిబిరం


వర్క్‌షాపులో పాల్గొన్న అధ్యాపకులు

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయం మానవ వనరుల వికాస కేంద్రం ఆధ్వర్యంలో దాదాపు 70 కళాశాలల అధ్యాపకులకు శిక్షణ శిబిరం మంగళవారం నిర్వహించారు. మానవ వనరుల విభాగ వికాస కేంద్రం డైరెక్టర్ చీఫ్ డాక్టర్ దేవదత్త ఇండోరియా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ విద్యా విధానం ఆధారంగా అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ కులపతి ప్రొఫెసర్ దేవీ ప్రసాద్ మిశ్ర ముఖ్య అతిథిగా పాల్గొని మానవ వనరుల వికాస విభాగ అధికారులను ప్రశంసించారు. స్నాతకోత్తర పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత కుమార్ పాత్రో మాట్లాడుతూ.. అనేక కళాశాలల్లో అవసరమైనంత మంది అధ్యాపకులు లేకపోవడం వలన సమస్యగా ఉందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కార్యదర్శి మహేశ్వర చంద్ర నాయిక్, కొరాపుట్ కేంద్ర విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ రమేంద్ర కుమార్ పాడీ, రెవెన్సా వర్సిటీ విశ్రాంత అధ్యాపకులు గోరంగ చంద్రనంద తదితరులు పాల్గొన్నారు.

హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళన



ఆందోళన చేస్తున్న సిబ్బంది

రాయగడ: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ హాస్పిటల్ సఫాయి, హౌస్ కీపింగ్ సిబ్బంది మంగళవారం ఆందోళన చేపట్టారు. స్థానిక బారిజోల వద్దనున్న జిల్లా ముఖ్యవైద్యాధికారి కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన సిబ్బంది, తమ డిమాండ్లు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. సఫాయి, హౌస్ కీపింగ్ చేస్తున్న సిబ్బందికి గుత్తేదారు సంస్థ సకాలంలో వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ ప్రతీ నెలలో జమచేయాలన్నారు. ఆల్ ఒడిశా హాస్పిటల్ సఫాయి కర్మచారి రాయగడ శాఖ అధ్యక్షులు నేహా సింహ, కస్తూరీ నాయక్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు జోగేశ్వర్ దాస్, కార్యదర్శి గణేష్ కుమార్ సాహు, ఉపాధ్యక్షుడు మాధవ ఘొష్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ


ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

పర్లాకిమిడి: ఒడిశాకు చెందిన విద్యార్థులకు ఫార్మా, హెల్త్ కేర్ రంగాల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగాలు కల్పించేందుకు శ్రీకాకుళం బొల్లినేని మెడ్‌స్కిల్స్‌తో మంగళవారం ఎంవోయూ కుదుర్చుకున్నామని గజపతి జిల్లా డీఎస్‌డీఈవో సౌభాగ్య స్మృతిరంజన్ త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు మంగళవారం పర్లాకిమిడిలో కలెక్టరేట్ వద్ద జిల్లా స్కిల్ డవలప్‌మెంట్, ఎంప్లాయిమెంట్ శాఖ అధికారి కార్యాలయంలో ఈ ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకాలు పెట్టారు. ఎన్‌యూపీ ఒడిశా శిబిరంలో భాగంగా 240 మంది విద్యార్థులకు ప్రభుత్వ సహకారంతో శిక్షణ అందించనున్నామని పేర్కొన్నారు. ప్లస్ త్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్, ఎస్ఎస్‌సీ, ప్లస్ టూ, ప్లస్ త్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు అసోసియేట్ స్టోర్ ఫార్మా కోర్సులో శిక్షణ ఇస్తామని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజన వసతి సదుపాయం, యూనిఫామ్ స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 7331118019, 7680945357, 7995013422 నంబర్లను గానీ, శ్రీకాకుళం రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గానీ సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, గజపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

దర్జాగా ప్రభుత్వ స్థలం కబ్జా


కోటబొమ్మాళి ప్రకాశ్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం

టెక్కలి: కోటబొమ్మాళి మండల కేంద్రంలో ప్రకాశ్‌నగర్ కాలనీలో ప్రభుత్వ స్థలంలో అధికార పార్టీ కార్యకర్తలు కొంత మంది దర్జాగా అక్రమ నిర్మాణం చేస్తున్న విషయం అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు నివ్వెరపోతున్నారు. రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండటంతో కాలనీవాసులు స్పందించి సర్పంచ్ కాళ్ల సంజీవరావు సహకారంతో మంగళవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడ మే కాకుండా ఆందోళన చేపట్టారు. ప్రకాశ్‌నగర్ కాలనీలో కొంత మంది అధికార పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, దీనిపై చర్యలు చేపట్టకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా ఆందోళన బాట పడతామంటూ హెచ్చరించారు.

రైలు ఢీకొని యువకుడు మృతి


ట్రాక్ వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

నరసన్నపేట : కామేశ్వరిపేట సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఓ వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మంగళవారం ఉదయం ఉర్లాం రైల్వేస్టేషన్ మాస్టర్ నుంచి సమాచారం రావడంతో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడు శ్రీకాకుళం టౌన్ బలగ పరిధిలోని బుచ్చిపేటకు చెందిన జడుగుల చిట్టిబాబు(31)గా గుర్తించినట్లు హెచ్‌సీ మధుసూదనరావు తెలిపారు. ప్రమాద కారణాలు తెలియాల్సి ఉందన్నారు. సోమవారం సాయంత్రం రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

జె.ఆర్.పురంలో వ్యాన్ బీభత్సం

- లారీ, రెండు బైకులను ఢీకొట్టిన వైనం
- డ్రైవర్‌కు దేహశుద్ధి చేసిన స్థానికులు


ప్రమాదానికి కారణమైన ఐషర్ వ్యాన్

రణస్థలం: రణస్థలంలో జాతీయ రహదారిపై ఐషర్ వ్యాన్ బీభత్సం సృష్టించింది. విశాఖపట్నం వైపు నుంచి నరసన్నపేట వెళ్తున్న ఈ వ్యాన్ మంగళవారం సాయంత్రం దన్నానపేట వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న ఈసర్ల రాంబాబు అనే వ్యక్తిని ఢీకొట్టింది. కొంతదూరం ముందుకొచ్చి ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. అక్కడితో ఆగకుండా అత్యంత రద్దీగా ఉండే రామతీర్థాలు కూడలి వద్ద మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌కు స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వ్యాన్ ఆగకపోతే పెను ప్రమాదం జరిగేది. జె.ఆర్.పురం పోలీసులులు స్పందించి జేసీబీ సాయంతో వ్యాన్‌ను పక్కకు నెట్టారు. ఈ ఘటనలో లావేరు మండలం పైడియ్యవలసకు చెందిన ఈసర్ల రాంబాబుకు తీవ్ర గాయాలు కావడంతో రణస్థలం సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట కేసులో నిందితుడికి జైలుశిక్ష

సంతబొమ్మాళి: కొట్లాట కేసులో నేరం రుజువు కావడంతో నౌపడ గ్రామానికి చెందిన రోకళ్ల ఎర్రన్నకు కోటబొమ్మాళి ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.రోషిని రెండు నెలల జైలు శిక్ష విధించినట్లు నౌపడ ఎస్ఐ నారాయణస్వామి మంగళవారం తెలిపారు. నౌపడ గ్రామానికి చెందిన చెన్నూరి వెంకట్ రాజుపై ఎర్రన్న దాడి చేయడంతో కేసు నమోదైందని, నేరం రుజువు కావడంతో శిక్ష పడిందని చెప్పారు.

కారు ఢీకొని ఇద్దరు మృతి

జయపురం: సబ్ డివిజన్ బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధి 26వ జాతీయ రహదారి పిండాగుడ జంక్షన్‌లో కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. మృతి చెందిన ఇద్దరిలో ఒకరు బొరిగుమ్మకు చెందిన రోహితేశ్వర బెహర(55) కాగా, మరోవ్యక్తి పిండాగుడ గ్రామానికి చెందిన గోపాల హరిజన్(57)గా గుర్తించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రోహితేశ్వర బెహర, గోపాల్ హరిజన్‌లు పిండాగుడ గ్రామం జంక్షన్ 26వ జాతీయ రహదారి పక్కన నిలుచొని మాట్లాడుతుండగా, జయపురం నుంచి బొరిగుమ్మ వైపు వేగంగా వస్తున్న ఒక ఇండికా కారు వారిని ఢీకొంది. దీంతో ఇరువురూ దూరంగా ఎగిరిపడ్డారు. సమాచారం అందిన వెంటనే బొరిగుమ్మ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకున్నారు. ఘటన స్థలంలోనే ఇరువురూ మృతి చెందారని బొరిగుమ్మ పోలీసులు వెల్లడించారు. అయితే కారు డ్రైవర్ పరారైనట్లు వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించారు. కారు డ్రైవర్‌ను త్వరలోనే పట్టుకుంటామని దర్యాప్తు అధికారి సస్మిత నాయక్ వెల్లడించారు.

బీజేడీ ఎంపీల నిరసన


నిరసన తెలుపుతున్న బీజేడీ ఎంపీలు

భువనేశ్వర్: రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న నేరాలకు వ్యతిరేకంగా బిజూ జనతా దళ్ రాజ్యసభ సభ్యులు పార్లమెంట్ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర శాంతియుతంగా మంగళవారం నిరసన తెలిపారు. వర్షం కురుస్తున్నా గొడుగులు వేసుకుని ప్లకార్డులతో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో ఒడిశా ప్రభుత్వం నిష్క్రియాత్మకతను వీరంతా ఖండించారు. జవాబుదారీతనం, బలమైన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ‘ఒడిశా రక్త సిక్తం, గాఢ నిద్రలో బీజేపీ’ ‘ఒడిశా ప్రభుత్వం మౌనం సిగ్గుచేటు’ వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా బాలాసోర్ నుంచి బొలంగా వరకు మహిళలపై దారుణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నలుగురిపై కేసు నమోదు


తల్లిదండ్రులను ప్రశ్నిస్తున్న దర్యాప్తు బృందం

భువనేశ్వర్: బొలంగీరు జిల్లా టిట్లాగడ్ బాగ్దేర్ గ్రామంలో పసికందు అమ్మకం ఘటనపై దర్యాప్తు ప్రారంభమైంది. చిన్నారిని కన్న తల్లిదండ్రులు, కొనుగోలు చేసిన దంపతులను దర్యాప్తు బృందం ప్రధానంగా ప్రశ్నిస్తోంది. ఈ ఘటనపై టిట్లాగడ్ సీడీపీవో స్వయంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బిడ్డను కన్న తల్లిదండ్రులు, కొనుగోలు చేసిన దంపతుల వ్యతిరేకంగా కేసులు నమోదు చేశారు.

కాపుగోపాలపురంలో చైన్‌స్నాచింగ్


బాధితురాలు కాళ్ల జ్యోతి

పాతపట్నం : చైన్‌స్నాచర్లు రెచ్చిపోతున్నారు. ఒంటరిగా వెళ్లే మహిళలే లక్ష్యంగా దాడులకు ఎగబడుతున్నారు. పాతపట్నం మండలం కాపు గోపాలపురంలో సోమవారం సాయంత్రం చైన్‌స్నాచింగ్ చోటుచేసుకుంది. పాతపట్నం మేజర్ పంచాయతీ కోటగుడి కాలనీకి చెందిన దంపతులు కాళ్ల జ్యోతి, నారాయణరావులు పశువులకు కుడితి పెట్టడానికి కాపుగోపాలపురంలోని నీలకంఠేశ్వర ఆలయం సమీపంలోని పశువులశాల వద్దకు బైక్‌పై వెళ్లారు. భార్యని దించేసి నారాయణరావు కాపుగోపాలపురం వచ్చేశారు. జ్యోతి పశువుల శాల వైపు కుడితి పెట్టడానికి బకెట్‌తో వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై ఇద్దరు దొంగలు వచ్చి పుస్తెలతాడు లాక్కెళ్లారు. జ్యోతి కేకలు వేసేసరికే పర్లాకిమిడి వైపు పారిపోయారు. రెండు తులాల బంగారు పుస్తెలతాడు చోరీ జరిగిందని బాధితురాలు వాపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు.

రహస్య కెమెరాతో చిక్కిన యువకుడు


పోలీసులకు చిక్కిన యువకుడు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దేవస్థానం భద్రత వ్యవస్థ అస్తవ్యస్తంగా కొనసాగుతోంది. శ్రీమందిరం లోనికి ప్రవేశించే ముందు తనిఖీలు నిర్వహించి స్వామి దర్శనం కోసం బారులుతీరిన భక్తులను అనుమతిస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రధానంగా ఆలయ పరిమితుల పరిరక్షణలో భక్తులు, యాత్రికులు అవకతవకలకు పాల్పడకుండా నిఘా వేసేందుకు ప్రత్యేక రక్షక భటుల వ్యవస్థని శ్రీమందిరం నిర్వహిస్తోంది. మరోవైపు శ్రీమందిరం ప్రాంగణం నో ఫ్లయింగ్ జోన్, డ్రోన్ వ్యతిరేక జోన్‌గా ప్రకటించారు. ఈ బందోబస్తు ఉన్నప్పటికీ తరచూ ఏదో రకంగా శ్రీమందిరంలోని పరిమితులు అధిగమించి పలు లోపలి ప్రాంగణాల దృశ్యాల డ్రోన్ చిత్రీకరణ, వీడియో రికార్డింగు, ఫొటోలతో బాహ్య ప్రపంచం వెలుగులోకి వస్తున్నాయి.

కళ్లద్దాల చాటున రికార్డింగ్

తాజాగా మంగళవారం కంటి అద్దాల చాటున శ్రీమందిరం లోపలి దృశ్యాలను గుట్టురట్టు కాకుండా బంధిస్తున్న ప్రయత్నంలో యాత్రికుడు రహస్య కెమెరాతో పట్టుబడ్డాడు. పోలీసులు బేహెరాణొ ద్వారం దగ్గర అనుమానంతో అతడిని పట్టుకున్నారు. రహస్యంగా రికార్డ్ చేయగల రే–బాన్ మెటా కళ్లజోడు ధరించిన యువకుడి కదలికపై సందేహం కలిగిన శ్రీమందిరం ప్రత్యేక రక్షక భటుల వర్గం నిలదీసింది. వీరి పరిశీలనలో యువకుడు ధరించిన కళ్లద్దాలపై రహస్య కెమెరా అమరిక ఉన్నట్లు ఖరారు అయింది. దీంతో ఆలయ లోపల చిత్రాల్ని చిత్రీకరించినట్లు భావిస్తున్నారు. ఈ సమగ్ర వ్యవహారంపై ఆరా తీసేందుకు రక్షక భటులు యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు పూరీ గజపతి నగరంలో ఉంటున్నట్లు సమాచారం. సింహద్వారం ఠాణా పోలీసులు అతడిని ప్రశ్నిస్తున్నారు.

శ్రీజగన్నాథుని ముఖ చిత్రాలతో డోర్‌మ్యాట్లు

- చర్యలు తీసుకోవాలని భక్తుల ఆగ్రహం


సింహద్వారం ఠాణాలో ఫిర్యాదు చేసిన ప్రతినిధులు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని ముఖ పోలికలతో రూపొందించిన డోర్‌మ్యాట్ల విక్రయ ప్రకటన వివాదాస్పదం అయింది. ఆలీ ఎక్స్‌ప్రెస్ అనే వెబ్‌సైట్ శ్రీజగన్నాథుని ముఖం ఉన్న డోర్‌మ్యాట్స్ అమ్మకానికి అందుబాటులో ఉన్నట్లు ప్రసారం చేసింది. ఈ ప్రసారం బహిరంగం కావడంతో వివాదం చెలరేగింది. పవిత్ర స్వరూపంగా భావించే శ్రీజన్నాథుని చక్ర నయనాలపై కాలు మోపడం, తుడుచుకోవడం అపచారంగా పరిగణించిన భక్త జనం విచారం వ్యక్తం చేసింది. ఈ చర్యకు వ్యతిరేకంగా తక్షణమే చర్యలు చేపట్టాలని పలు సేవా సంస్థలు స్థానిక సింహద్వారం ఠాణాలో పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జగన్నాథుని ప్రతిమను సాధారణ వస్తువుగా ఉపయోగించడం హిందూమతంపై ఉన్న అగౌరవాన్ని స్పష్టం చేస్తుంది. ఈ దారుణమైన తప్పును సరిదిద్దడానికి తక్షణ చర్యలు తప్పనిసరి అని సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వీఐపీ దర్శనం ముసుగులో మోసం



వీఐపీ దర్శనం రశీదు

భువనేశ్వర్: పూరీలో కొలువుదీరిన జగన్నాథుడు ప్రపంచవ్యాప్తంగా అశేష భక్తజనుల ఆరాధ్య దైవం. స్వామి దర్శనం కోసం భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. శ్రీమందిరంలో అత్యంత చేరువలో మూల విరాటులను కళ్లారా దర్శించుకోవాలని ఆరాటపడుతుంటారు. అయితే ఈ భక్తిభావాన్ని సొమ్ము చేసుకునే దిశలో చాటుమాటున ఆన్‌లైన్‌లో వీఐపీ దర్శనం పేరుతో నిలువు దోపిడీ ప్రారంభం అయింది. హరి ఓం యాప్‌లో వీఐపీ దర్శనం చేసుకోవచ్చని తప్పుడు ప్రచారం ఊపందుకుంది. రూ.1,000లకు వీఐపీ దర్శనం చేసుకోవచ్చని ఈ యాప్ ప్రచారం చేస్తున్న విషయం బట్టబయలైంది. స్లాట్ బుకింగ్ కోసం హెల్ప్‌లైన్ నంబర్ కూడా జారీ చేసింది. ఒక భక్తుడు స్లాట్ బుక్ చేసుకుని మోసపోయిన తర్వాత ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది.

సైబర్ ఠాణాలో ఫిర్యాదు

శ్రీమందిరంలో మూల విరాటుల వీఐపీ దర్శనం పేరుతో భక్తులను హరి ఓం యాప్ మోసం చేసిందని ఆరోపిస్తూ శ్రీమందిరం అధికార వర్గం (ఎస్‌జేటీఏ) సైబర్ ఠాణాలో ఫిర్యాదు దాఖలు చేసింది. శ్రీమందిరం ఆధ్వర్యంలో వీఐపీ దర్శనం కోసం ఎటువంటి వ్యవస్థ పని చేయడం లేదు. ఈ నేపథ్యంలో వీఐపీ దర్శనం పేరిట భక్తులను మోసగిస్తున్న హరి ఓం యాప్‌పై చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

హ్యాపీ టైగర్స్ డే



ప్రపంచ పులుల దినోత్సవం పురస్కరించుకొని పూరీ సాగర తీరంలో పద్మశ్రీ సుదర్శన్ పటా్నయక్ ఈ సైకత శిల్పం ఆవిష్కరించాడు. 51 చిన్న పులులతో కూడిన పెద్ద పులి శిల్పం సందర్శకులు, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంది. పర్యావరణ వ్యవస్థ సంరక్షణకు పులి సంరక్షణ ముడిపడి ఉంది. అడవులు, మానవ సమాజంతో పులుల సంబంధం బలమైనదిగా ఆయన పేర్కొన్నాడు.

– భువనేశ్వర్/పూరీ

34 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు


పట్టుబడిన నిందితుడితో పోలీసులు

ఇచ్ఛాపురం టౌన్ : ఒడిశా నుంచి ముంబైకి 34.32 కిలోల గంజాయి తరలిస్తున్న సంతున్ దాసు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. పట్టణ ఎస్ఐ ముకుందరావు, పోలీసు సిబ్బంది మంగళవారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్, చిదంబరీశ్వర ఆలయ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా రాష్ట్రం ఖరియాగూడా ప్రాంతానికి చెందిన సంతున్‌దాసు అనుమానాస్పదంగా కనిపించడంతో లగేజీని తనిఖీచేశారు. అందులో 34.32 కిలోల గంజాయి ఉండటంతో అదుపులోకి తీసుకొని విచారించారు. తన గ్రామంలోని రైతుల వద్ద గంజాయి కొని ముంబైలోని లొబొకుండ అనే వ్యక్తికి అందజేసేందుకు వెళ్తున్నట్లు గుర్తించారు. గంజాయితోపాటు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు.

ఎరువుల కృత్రిమ కొరత తగదు


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస : ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి రైతులను మోసం చేయడం కూటమి ప్రభుత్వానికి తగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు బస్తా యూరియా కోసం రోజూ గంటల తరబడి పనులు మానుకొని అధికారులు, ఆర్ఎస్‌కేల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలకు వస్తున్న ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నాయని, టీడీపీ నాయకులు ఎరువులను తమ ఇళ్ల వద్ద దాచుకొని బయట అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే కలెక్టర్ స్పందించి రైతుల కష్టాలు తీర్చాలని కోరారు. ఆమదాలవలస నియోజకవర్గంలో సాగు చేస్తున్న 53,000 ఎకరాల సాగుకు 2850 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ప్రభుత్వం 1600 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందన్నారు. పొందూరు మండలంలో 4000 ఎకరాల్లో సాగు చేస్తున్న మొక్క జొన్న పంటకు అదనంగా 600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమన్నారు. సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇవేవీ పట్టకుండా విహార యాత్రలు చేస్తూ సొంత ఆదాయాలు చూసుకుంటున్నారని మండిపడ్డారు. సమావేశంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, నాయకులు సాకేటి శ్రీనివాసరావు, అన్నపు కృష్ణ, ధనుజయరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు,కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి కె.శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఈవీఎం గొడౌన్ల తనిఖీ



ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ అంబేద్కర్

నెల్లిమర్ల: నెలిల్లమర్లలో ఉన్న ఈవీఎం గోదాములను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మంగళవారం తనిఖీ చేశారు. గోదాము షట్టర్లకు, లోపలి గదులకు వేసిన సీళ్లను, తాళాలను పరిశీలించారు. బందోబస్తుపై సమీక్షించారు. సీసీ కెమెరాల ద్వారా చుట్టుపక్కల, గొడౌముల్లోని పరిస్థితులను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డీఓ డి.కీర్తి, నెల్లిమర్ల తహసీల్దార్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

- ఉద్యోగుల సమస్యల పట్ల స్పందించిన కలెక్టర్



బొప్పరాజుతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేద్కర్

విజయనగరం అర్బన్: కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కలిసి పలు సమస్యలను వివరించారు. బొప్పరాజు మంగళవారం జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకుని రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. వాటిపై కలెక్టర్ అంబేద్కర్ సానుకూలంగా స్పందించి జిల్లా స్థాయి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బొప్పరాజుతో పాటు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాడ్డి గోవింద, సూర్య ఇతర నాయకులు పాల్గొన్నారు.

పొలంలోకి ఆర్టీసీ బస్సు



పొలంలోకి ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

జియ్యమ్మవలస: జియ్యమ్మవలస మీదుగా వనజ వెళ్తున్న ఆర్టీసీ బస్సు మంగళవారం జియ్యమ్మవలస దాటిన తరువాత పొలాల్లోకి జారుకుంది. రహదారిపై జారుడు ఉండడంతో యూటర్న్ తీసుకునే క్రమంలో బస్సు పొలాల్లోకి వెళ్లినట్లు ప్రయాణికులు తెలిపారు. డ్రైవర్ చాకచక్యంతో బస్‌ను అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని ప్రయాణికులు చెప్పారు.

గంజాయి తాగుతున్న ఐదుగురు అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలో గంజాయి తాగుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని సీఐ చౌదరి మంగళవారం తెలిపారు. ఈ నెల 28న సాయంత్రం గూడ్స్‌షెడ్ డీఎస్పీ కార్యాలయం వద్ద గంజాయి తాగుతూ అర్జున్ సింగ్, రోషన్ సింగ్‌లు పట్టుబడగా ప్రదీప్‌నగర్‌లో మరో ముగ్గురు గంజాయి సేవిస్తూ దొరికారన్నారు. అర్జున్‌సింగ్, రోషన్‌సింగ్‌లది ఉత్తరప్రదేశ్‌గా తెలుస్తోందన్నారు.

అధికార బలంతో.. అనధికార నియామకం!

- నోటిఫికేషన్ లేకుండానే ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు భర్తీ
- మంత్రి కొండపల్లి ఇలాకాలో అధికారుల నిర్వాకం
- నియామకంపై ఎంపీడీఓ, డ్వామా పీడీది తలోమాట
- నరవ ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంపై ఫిర్యాదు


సాక్షి
ఉపాధిలో బినామీ మస్తర్లు..!

నరవలో బినామీ మస్తర్లపై సాక్షిలో ప్రచురించిన కథనం



జిల్లా నీటియాజమాన్య సంస్థ కార్యాలయం

విజయనగరం ఫోర్ట్: అధికార బలం ముందు నిబంధనలు చెత్తబుట్టలో కలిసిపోయాయి. అనధికార నియామకానికి అధికార యంత్రాంగం పచ్చజెండా ఊపేసింది. ప్రజా ప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గింది. నోటిఫికేషన్ లేకుండానే ఫీల్డు అసిస్టెంట్ పోస్టును భర్తీ చేసేసింది. ఈ అంశం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు కాదని..

గంట్యాడ మండలంలోని నరవ గ్రామం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందన్నది గ్రామస్తుల ఆరోపణ. నోటిఫికేషన్ ఇవ్వకుండానే అధికార పార్టీ నేతలు చెప్పారని ఏకపక్షంగా ఓ మేట్‌ను ఫీల్డు అసిస్టెంట్‌గా నియమించారంటూ గ్రామానికి చెందిన నరవ సన్యాసిరావు అనే వ్యక్తి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కలెక్టర్ సేతుమాధవన్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తప్పుడు మస్తర్లు వేశారన్న ఫిర్యాదు మేరకు ఎంపీడీఓ విచారణ చేసి తొలగించిన మహిళా మేట్‌ను ఇప్పుడు ఫీల్డు అసిస్టెంట్‌గా ఎలా నియమిస్తారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

దరఖాస్తులు స్వీకరించకుండానే..

ఏదైనా గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు ఖాళీ అయితే సంబంధిత మండల ఎంపీడీఓ నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించాలి. ఆ దరఖాస్తులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయో లేదో పరిశీలించి వారి జాబితాను డ్వామా పీడీకి పంపించాలి. పీడీ పరిశీలించి అర్హులను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమిస్తారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టుకు 10వ తరగతి పాస్, లేదా ఫెయిల్ అయిన వారు అర్హులు. 25 రోజులు పాటు పనికి వెళ్లి ఉండాలి, మేట్‌గా పనిచేసి ఉండాలి. మేట్‌గా పనిచేసిన వారు లేకపోతే 25 రోజులు పనిచేసిన వారిని పరిగణలోకి తీసుకోవాలి. అయితే నరవ ఫీల్డు అసిస్టెంట్ పోస్టు భర్తీలో అధికారులు ఇవేవీ పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు చెందిన బంధువు ఒకరు అధికారులపై ఒత్తిడి తెచ్చి తమ మనిషిని మేట్‌గా వేయించుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగం ఇచ్చేశారు

నోటిఫికేషన్ లేకుండా మా గ్రామానికి చెందిన సుంకరి లక్ష్మీకాంతం అనే మహిళకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చేశారు. గతంలో ఆమె బినామీ మస్తర్లు వేసిందని ఎంపీడీఓ, కలెక్టర్‌కు ఫిర్యాదుచేశాను. అధికారుల విచారణలో బినామీ మస్తర్లు వేసినట్టు నిర్ధారణ అయింది. ఆమెను మేట్ విధుల నుంచి తొలగించారు. ఇప్పుడు అదే వ్యక్తికి ఫీల్డు అసిస్టెంట్ పోస్టు ఇవ్వడం విచారకరం. దీనిపై ఇన్‌చార్జి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను.
– నరవ సన్యాసిరావు, నరవ గ్రామస్తుడు

నోటిఫికేషన్ ఇవ్వలేదు

నరవ ఫీల్డ్ అసిస్టెంట్‌కు సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వలేదు. గ్రామ సభలో సూచించిన మహిళ పేరున డ్వామా పీడీకి ప్రతిపాదనలు పంపించాం. ఆమె నియామక ఉత్తర్వులు ఇచ్చారు. – ఆర్.వి.రమణమూర్తి, ఎంపీడీఓ

ప్రతిపాదనల మేరకు నియామక ఉత్తర్వులు

ఎంపీడీఓ నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు నియామక ఉత్తర్వులు ఇచ్చాం. ఎంపీడీఓ నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులను పరిశీలించిన మీదట ప్రతిపాదనలు మాకు పంపిస్తారు. నోటిఫికేషన్ ఇచ్చినది లేనిదీ తెలియదు. ఆ మేరకు నియామక ఉత్తర్వులు ఇస్తాం. – ఎస్.శారదాదేవి, డ్వామా పీడీ

జాతీయస్థాయి దివ్యాంగుల పోటీల్లో 'తోషిని'కి కాంస్య పతకం

- ఈనెల 24 నుంచి 28వరకు బిలాస్‌పూర్‌లో జరిగిన పోటీలు



కాంస్య పతకం సాధించిన అడ్డా తోషిని(పసుపు రంగు జెర్సీ)

తెర్లాం: జాతీయస్థాయిలో జరిగిన దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్స్ భారత్–2025 పోటీల్లో తెర్లాం హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని అడ్డా తోషిని 'బోసి గేమ్' వ్యక్తిగత హయ్యర్ ఎబిలిటీ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈఏడాది ఏప్రిల్ నెలలో నూజివీడులోని అగిరిపల్లి హిల్ పారడైజ్ స్కూల్‌లో విద్యాశాఖ, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ రాష్ట్ర స్పెషల్ ఒలింపిక్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్ సాధించడంతోపాటు, దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్ భారత్–2025 జాతీయ స్థాయి పోటీలకు తోషిని ఎంపికైన విషయం తెలిసిందే. ఈనెల 24 నుంచి 28వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ యూనివర్సిటీ మైదానంలో జాతీయ స్థాయి దివ్యాంగుల స్పెషల్ ఒలింపిక్స్ భారత్–2025 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొన్న తోషిని తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుని కాంస్య పతకాన్ని సాధించింది. జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించిన తోషినిని రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు, జిల్లా అధికారులు, హైస్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య

- కలెక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం ఫోర్ట్:

అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ మేరకు ఆయన తన చాంబర్‌లో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యను ప్రోత్సహించేందుకు పూర్వ శ్రేణి పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెల 4వ శనివారం నిర్వహిస్తున్న పూర్వ శ్రేణి విద్యా దినోత్సవం బాలల మానసిక, శారీరక, భాష, సాంఘిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విమలారాణి, నోడల్ అధికారి తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

150 కిలోల గంజాయి పట్టివేత

శృంగవరపుకోట: మండలంలో బొడ్డవర వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్.కోట పోలీసులకు సుమారు 150కిలోల గంజాయి పట్టుబడినట్టు సమాచారం. సోమవారం రాత్రి అరకు నుంచి వస్తున్న కేరళ రిజిస్ట్రేషన్‌తో ఉన్న బొలెరో వాహనంలో గంజాయిని పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా వాహనాన్ని, వాహనంలో ఉన్న సుమారు 150కిలోల గంజాయిని వ్యక్తుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తుల నుంచి మరింత సమాచారం సేకరించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఇదే విషయమై ఎస్.కోట సీఐ వేచలపు నారాయణమూర్తి వివరణ కోరగా, పూర్తి వివరాలు తెలిపేందుకు బుధవారం మీడియా సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

ఆడపిల్లలకు స్వీయ రక్షణలో ప్రత్యేక శిక్షణ



సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్ శిక్షణను ప్రారంభించిన ఎస్పీ వకుల్, చిత్రంలో ఏఎస్పీ సౌమ్యలత, శిక్షకురాలు రాధ

విజయనగరం క్రైమ్: జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణ మెలకువలు నేర్పించేందుకు ప్రత్యేకంగా ఒక మహిళా శిక్షకురాలిని నియమించినట్లు ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం తెలిపారు.ఈ మేరకు నగరంలోని కంటోన్మెంట్ శార్వాణి పోలీసు వెల్ఫేర్ ఆంగ్ల పాఠశాలలో నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులపై జరిగే దాడులు, ఈవ్‌టీజింగ్, ఆకతాయిల వేధింపులు, లైంగిక దాడులను ప్రతిఘటించి, వారి దాడులను తిప్పి కొట్టేందుకు శిక్షణ ఏర్పాట్లు కల్పిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు తమను తాము రక్షించుకునేందుకు కొన్ని స్వీయ రక్షణ టెక్నిక్స్ ను నేర్పాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా రాధ అనే మహిళా శిక్షకురాలిని జిల్లా పోలీసుశాఖ నియమించిందని చెప్పారు. ఈ శిక్షకురాలు పాఠశాలల్లోని వ్యాయామ ఉపాధ్యాయులకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ ను ముందుగా నేర్పించి, వారి సహకారంతో అన్ని పాఠశాలల్లోని విద్యార్థినులకు వాటిని నేర్పించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ శిక్షణ కోసం ఉపాధ్యాయులు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, ఆర్ఐ ఎన్.గోపాలనాయుడు, పాఠశాల హెచ్ఎం సంధ్య, ఆర్ఎస్సైలు ప్రసాదరావు, రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మృతదేహం వివరాలు లభ్యం



మృతుడు ఈశ్వరరావు (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు గ్రామం సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు సోమవారం గమనించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టి మృతుడిని మార్లాపల్లి గ్రామానికి చెందిన లెక్కల ఈశ్వరరావు(51)గా గుర్తించారు. మృతుడు వేసుకున్న బట్టలను, మృతదేహాన్ని బంధువులు చూసి గుర్తుపట్టినట్లు ఎస్సై నవీన్ పడాల్ తెలిపారు. ఈశ్వర రావుకు విపరీతంగా తాగుడు అలవాటు ఉంది. ఈ క్రమంలో శనివారం రాత్రి పూటుగా మద్యం తాగి ఇంటి నుంచి వెళ్లేపోయాడు. ఎప్పటి మాదిరిగా తిరిగి వస్తాడనుకోగా ఎంతకీ రాలేదు. చందులూరు వైపు వెళ్లి రోడ్డు పక్కన తుప్పల్లో పడిపోవడంతో సాయం చేసిన వారు లేక మృతి చెంది ఉంటాడని కుటుంబసభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మృతుడికి భార్య వరం, కూతురు, కొడుకు ఉన్నారు. ఈ మేరకు భార్య వరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కళాశాలల్లో ప్రవేశాలు పెంచాలి



ఇన్‌స్పైర్ మనక్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

పార్వతీపురం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు కృషిచేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పాఠశాల విద్యపై అధికారులతో మంగళవారం సమీక్షించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రవేశాలు తక్కువగా ఉన్నాయని, ప్రవేశాలకు ఇంకా సమయం ఉన్నందున విద్యార్థులు చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ, సీతంపేట ఎంఈఓలు ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఇన్‌స్పైర్ మనక్ అవార్డు నామినేషన్లు–2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ బి.రాజ్‌కుమార్, ఏడీ రమాదేవి, ఏపీసీ తేజేశ్వరరావు, డీఈవీఓ నాగేశ్వరరావు, డీడీ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ప్రధానం

సీతంపేట: ఎపిడమిక్ సీజన్లో వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలని, నివారణ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు వైద్యులకు సూచించారు. సీతంపేట మండలం దోనుబాయి పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రిని గురువారం సందర్శించారు. ఓపీ తీరుపై ఆరా తీశారు. మందుల నిల్వలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మలేరియా పాజిటివ్ కేసుల ఆధారంగా ఆయా గ్రామాల్లో ఐఆర్ఎస్ 5 శాతం ఏసీఎం ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. దోనుబాయిలో రెండో వైద్యుని పోస్టు భర్తీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహన్‌రావు పాల్గొన్నారు.

పరిశ్రమల దరఖాస్తులు గడువులోగా పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం అందిన దరఖాస్తులను సింగల్ డెస్క్ పాలసీ కింద 21 రోజుల్లో పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. మే నుంచి జూలై వరకు 1652 దరఖాస్తులు అందగా 1634 దరఖాస్తులకు అనుమతి ఇచ్చామని, మిగిలిన వాటిలో 11 దరఖాస్తులు కాలుష్య నియంత్రణ మండలి వద్ద, మిగిలినవి ఫైర్, గ్రౌండ్ వాటర్, ఫ్యాక్టరీస్, లీగల్ మెట్రాలజి శాఖల వద్ద పెండింగ్ ఉన్నాయన్నారు. వాటిని గడువు లోగా పరిష్కరించాలని, తిరస్కరిస్తే తగిన కారణాలతో తిరస్కరించాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల కమిటీ సమావేశం జేసీ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కరుణాకర్, నాబార్డ్ డీడీఎం నాగార్జున, ఎల్‌డీఎం రమణమూర్తి, విద్యుత్‌శాఖ ఎస్ఈ లక్ష్మణ రావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, జిల్లా ఫైర్ ఆఫీసర్ రామ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జున రావు, ఫ్యాక్టరీస్, స్కిల్ డెవలప్‌మెంట్, శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డ్స్ సంక్షేమానికి చర్యలు

- ఎస్పీని కలిసిన విశాఖ రేంజ్ కమాండెంట్ జోషి



ఎస్పీ వకుల్ జిందల్‌ను కలిసి మొక్క ఇస్తున్న విశాఖ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ జోషి

విజయనగరం క్రైమ్: విశాఖ రీజియన్ హెూంగార్డ్స్ కమాండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎ.జోషి తొలిసారి జిల్లాకు వచ్చి, ఎస్పీ వకుల్ జిందల్‌ను మర్యాద పూర్వకంగా మంగళవారం కలిసి, పూల మొక్కను అందజేశారు. హెూంగార్డ్స్ సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ వకుల్ జిందల్ తో ఈ సందర్భంగా చర్చించారు. ఆపై వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని చెప్పారు. అనంతరం ఆయన హోంగార్డులతో సమావేశమై, విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను హోం గార్డు కుటుంబాలకు వర్తింపజేయాలని, విధి నిర్వహణలో ఒక ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి ప్రయాణించేందుకు బస్ పాస్ వంటి సౌకర్యాలను కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని హోం గార్డులు కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ నిర్వహించిన పరేడ్ ను కమాండెంట్ పరిశీలించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రమేష్ కుమార్, ఆర్ఎస్సై ముబారక్ అలీ, హెూంగార్డ్స్ ఇన్చార్జ్ హెచ్‌సీలు రాజు, శ్రీనివాసరావు, హెూంగార్డులు పాల్గొన్నారు.

నవోదయలో హ్యాండ్‌బాల్ మీట్



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న నవోదయ ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయలో హైదరాబాద్ రీజియన్ హ్యాండ్‌బాల్ మీట్ 2025–26ను ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ మంగళవారం అట్టహాసంగా ప్రారంభించారు. ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి, దక్షిణ భారతదేశంలో ఎనిమిది క్లస్టర్ల నుంచి వచ్చిన క్రీడాకారులు, ఆయా విద్యాలయాల కోచ్‌లను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాం, అదిలాబాద్, కన్నూర్, కరైకల్, ఎర్నాకుళం, హవేరి, హాసన్, కలబుర్గి క్లస్టర్ల నుంచి క్రీడాకారులు వచ్చినట్లు చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.రాజారావు నేతృత్వం వహిస్తారని చెప్పారు. కట్టా శ్రీను, ఎన్‌వీవీ కుమార్‌లు రిఫరీలుగా బాధ్యతలు నిర్వహిస్తారన్నారు. ఈపోటీల్లో విజేతలుగా నిలిచిన అథ్లెట్లు బీహార్ రాష్ట్రంలోని నలందలో జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో హైదరాబాద్ రీజియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. క్రీడాకారుల కోసం చేసిన ఏర్పాట్లను వివరించారు.

పీఎంశ్రీ పథకంలో బొబ్బిలి గురుకులం ఫస్ట్



పీఎం శ్రీ పథకం కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

బొబ్బిలి: పీఎంశ్రీ పథకంలో బొబ్బిలి గురుకుల పాఠశాల జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్టు ప్రిన్సిపాల్ రఘునాథరావు తెలిపారు. పట్టణంలోని సింహాల తోటలో ఉన్న ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలను పీఎంశ్రీ పథకంలో భాగంగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్ విధానంలో మంగళవారం జాతికి అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీడీ ఎ.రామారావు, ఎంఈఓలు చల్ల లక్ష్మణరావు, గొట్టాపు వాసు, గురుకుల సిబ్బంది, ఎంపిక చేసిన విద్యార్థులు పాల్గొన్నారు.

పాముకాటుతో విద్యార్థికి అస్వస్థత

సాలూరు రూరల్: మండలంలోని తోణాం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కాద్రాసునీల్ పాముకాటుతో అస్వస్థతకు గురయ్యాడు. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం సంపంగిపాడు పంచాయతీ గాలిపాడు గ్రామానికి చెందిన సునీల్ తోణాం ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజూ ఉదయం బహిర్భూమికి వెళ్లే అలవాటు ప్రకారం మంగళవారం బయటకు వెళ్లే సమయంలో పాముకాటుకు గురయ్యాడు. దీనితో వెంటనే పాఠశాల వార్డెన్ లచ్చయ్య తోణాం ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం సాలూరు ఏరియా ఆస్పత్రికి అక్కడినుంచి విజయనగరంలోని ఘోషా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వార్డెన్ లచ్చయ్య విద్యార్థిని దగ్గరుండి చూసుకుంటున్నారు.

ఆటో, బైక్ ఢీ: వృద్ధుడి మృతి

- మరో నలుగురికి తీవ్రగాయాలు



రోడ్డుపక్కన పడి ఉన్న ప్రమాదానికి కారణమైన బైక్‌పై వెళ్తున్న యువకుడు

లక్కవరపుకోట: అరకు–విశాఖపట్నం జాతీయ రహదారిలో మంగళవారం కొత్తవలస నుంచి ప్రయాణికులతో ఆటో వస్తుండగా సోంపురం జంక్షన్ నుంచి మితిమీరిన వేగంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి రంగరాయపురం జంక్షన్ సమీపంలో ఎత్తు బ్రిడ్జి వద్ద ఆటోను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆటో అదుపు తప్పి బొల్తా కొట్టి రోడ్డుపై పడిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న కిత్తన్నపేట గ్రామానికి చెందిన యడ్ల సింహాచలం(64) అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ బంగారయ్యతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. బైక్ నడుపుతున్న వ్యక్తి పూర్తిగా మద్యం తాగి ఉన్నాడని ఎల్.కోట జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా వారిని చూసి సంబంధిత వ్యక్తి ఆగకుండా బండిపై వెళ్లి ప్రమాదానికి కారణమయ్యాడని స్థానికులు తెలిపారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108 వాహనంలో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ పాపారావు తెలిపారు.

ఘనంగా ప్రమాణ స్వీకార మహోత్సవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కామర్స్ ఆఫ్ చాంబర్స్ కొత్త కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: స్థానిక మెసానిక్ టెంపుల్ వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్, విజయనగరం సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశిష్ట అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త కంకటాల మల్లిక్ హాజరయ్యారు. వారి సమక్షంలో కామర్స్ కొత్త అధ్యక్షుడిగా కాపుగంటి శ్రీనివాస్, కార్యదర్శిగా బొడ్డు శ్రీనివాస్, కోశాధికారిగా ప్రవీన్ అంచాలియా సహా మరో తొమ్మిది మంది వైస్ ప్రెసిడెంట్లు, ఇంకో తొమ్మిది మంది జాయింట్ సెక్రటరీలు ప్రమాణ స్వీకారం చేసి, పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు వారికి మంత్రి, వ్యాపారవేత్త, ఇతరులంతా అభినందనలు తెలిపారు. వ్యాపారులపై జీఎస్టీ, ప్రాపర్టీ టాక్స్ భారం పడకుండా ప్రభుత్వం రక్షణ కల్పించాలని కామర్స్ కొత్త అధ్యక్షుడు కాపుగంటి శ్రీనివాస్ మంత్రిని కోరారు. వ్యాపార సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను చాంబర్ తరపున పరిష్కరించేలా కొత్త కార్యవర్గం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం గత మూడేళ్లలో చాంబర్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను వీడియో రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాస్, పీఎసీ నాగేశ్వరరావు, చంద్రశేఖర్, ప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.